సాక్షి ఒడిశా

మంగళవారం । 12 । నవంబర్ । 2024



పరమహంస ఉత్సవాలు..

జయపురంలో అభిరాం పరమహంస ఉత్సవాలు నిర్వహించారు. జనం భారీగా వచ్చారు. - 8లో



విద్యార్థులకు ప్రతిభా పోటీలు

జయపురంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు రాణించారు. - 8లో



కెమెరాలు ఏర్పాటు చేయాలి

పర్లాకిమిడిలో దొంగతనాలు జరుగుతున్నాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

డయేరియాతో బాలిక మృతి



మమిత (ఫైల్)

రాయగడ: డయేరియా లక్షణాలతో 11 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి శంకరడ పంచాయతీ బహరకుటుమి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శివ మాఝి కుమార్తె మమిత కొద్ది రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురైంది. తరువాత డయేరియా బారిన పడడంతో కుటుంబీకులు ఆమెను టికిరి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడిచారు.

8 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడ్డ నిందితుడు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో అబ్కారీ శాఖ అధికారులు ఆదివారం సాయంత్రం దాడులు చేపట్టి ఓ వ్యక్తి నుంచి ఎనిమిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన కులదీప్ బఘాయిని అరెస్టు చేసి సోమవారం కోర్టుకు తరలించారు. బ్యాగులో గంజాయిని పట్టుకుని ఇతర రాష్ట్రానికి తరలించేందుకు రైల్వే స్టేషన్ బయట కులదీప్ నిరీక్షిస్తుండగా.. అనుమానించిన అబ్కారీశాఖ అధికారులు అతని బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది.

బైక్ ప్రమాదంలో ఒకరు మృతి



బలిమెల ఆరోగ్య కేంద్రంలో అరుణ్ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి బలిమెల–జైపూర్ ప్రధాన రహదారిపై చితాపరి 3వ వంతెన సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన బైక్ ప్రమాదంలో అరుణ్(36) అనే వ్యక్తి వంతెనపై నుంచి పడిపోయాడు. అటుగా వస్తున్న వారు చూసి వెంటనే అతడిని బలిమెల ఆరోగ్యకేంద్రానికి తరలించగా సోమవారం ఉదయం ఆయన మృతి చెందాడు. బలిమెల పోలీసులు కేసు నమోదు చేశారు.

చత్తీస్‌గఢ్‌లో

రోడ్డు ప్రమాదం

- ముగ్గురు ఒడిశా వాసులు మృతి
- 16 మందికి గాయాలు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి

కొరాపుట్: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒడిశాకి చెందిన ముగ్గురు వ్యవసాయ కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మరో 16 మంది గాయపడ్డారు. సోమవారం వేకువ జామున నబరంగ్‌పూర్ జిల్లా కొసాగుమ్మడ సమితికి చెందిన వ్యవసాయ కూలీలు చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి పికప్ వాహనంలో స్తుండగా రాజ్‌నగర్ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కేరాగాంకు చెందిన పుర్ణి బోత్ర (35), సిరాగుడకు చెందిన దయబతి సరబు (34), దహని బోత్ర (34) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన 16 మందిని చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్‌పూర్ పట్టణం సమీపంలో ఉన్న దిమిరిపాల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వీరంతా రోజూ ఒడిశా నుంచి చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వ్యవసాయ పనులు చేసి తిరిగి వస్తుంటారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం ఎంఎల్‌ఏ మనోహర్ రంధారి చత్తీస్‌గఢ్ చేరుకొని క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ముగ్గురు మృతదేహాలను స్వస్థలాలకు తరలించారు. క్షతగాత్రులకు ఆర్థిక సాయం చేశారు.

మార్మోగిన పంచాక్షరి



పర్లాకిమిడి: రైల్వేస్టేషన్ రోడ్డులోని చంద్రశేఖర ఆలయంలో పూజలు

కార్తీక సోమవారం పురస్కరించుకుని రాష్ట్రంలోని ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. వేకువ జాము నుంచే భక్తులు బారులుతీరారు. శివుడికి ప్రత్యేక, రుద్రాభిషేకాలు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: బారులుతీరిన భక్తులు



రాయగడ: పీహెచ్‌బీ కాలనీలో శివలింగానికి పూజలు

చెట్టు కింద శివలింగ దర్శనం



శివ లింగం బయట పడిన కూలిన వట వృక్షం



మట్టి నుంచి బయట పడిన శివ లింగం

జయపురం: కార్తీక మాసంలో బొరిగుమ్మ సమితి నువాగుడ గ్రామంలో ఒక అద్భుతం జరిగింది. గ్రామంలో ఆదివారం చెట్టు కింద మట్టిలో ఓ శివలింగం కనిపించింది. బొరిగుమ్మకు కేవలం 5 కిలోమీటర్ల దూరంలో గల నువాగుడలో శివలింగం బయటపడడంతో భక్తులు పూజలు చేశారు. సోమవారం శివ లింగానికి పూజలు చేసేందుకు భక్తులు పోటెత్తారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. దాదాపు 3 నెలల కిందట పురాతన అతి పెద్ద వటవృక్షం కూలిపోయింది. ఆదివారం ఆ ప్రాంతంలో కొంత మంది పిల్లలు ఆడుకుంటూ ఉండగా ఆట వస్తువు చెట్టు కిందకు వెళ్లిపోయింది. పిల్లలు చెట్టుకింద ఆట వస్తువు తీస్తుండగా వారికి శివ లింగం కనిపించింది. వారు వెంటనే ఈ విషయం గ్రామస్తులకు తెలిపారు. గ్రామ పెద్దలు వచ్చి లింగం కనిపించిన ప్రాంతంలో తవ్వగా శివ లింగం పూర్తిగా బయట పడింది. దీంతో వారంతా శివలింగానికి పూజలు చేశారు. ఈ ప్రాంతంలో శివలింగానికి ఆలయం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల ఆందోళన



కేంద్రీయ విద్యాలయం ప్రధాన గేట్లను మూసివేసిన విద్యార్థులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలోని సునాబెడాలో ఉన్న కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆందోళనకు దిగారు. ప్రధానగేట్లను మూసివేసి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. వసతి గృహంలో ఇస్తున్న ఆహారంలో నాణ్యతా లోపం ఉందని, ఒక్కోసారి కలుషిత భోజనం పెడుతున్నారని, మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నామని కొద్దిరోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. అయినా పాలకవర్గంలో స్పందన లేదు. కొన్నిసార్లు ఆందోళన చేసిన విద్యార్థులపై బయట వ్యక్తులు దాడులు చేసిన ఘటనలు కూడా వివాదాస్పదమయ్యాయి. ఈ ఆందోళనపై లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత మండిపడ్డారు. విద్యార్థులు ఆహారం, మంచినీటి విషయంలో అసంతృప్తితో ఉన్నప్పటికీ పాలకవర్గం సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు కోర్టు విధుల బహిష్కరణ



విలేకరులతో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు స్వరూప్ పాలో, హీరాచంద్

పర్లాకిమిడి: న్యాయవాది పత్తి రామారావుపై యాసిడ్ దాడిని ఖండిస్తూ న్యాయవాదులు సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. మంగళవారం కోర్టు విధులను బహిష్కరించడమే కాకుండా జిల్లా కోర్టులో కేసులు విచారణను అడ్డుకుంటామని బార్ అసోసియేషన్ అధ్యక్షులు స్వరూప్ పాలో, హీరా చంద్ తెలిపారు. న్యాయవాదులపై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడిన నేరస్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళన ద్వారా నేరతీవ్రతను ప్రజల దృష్టికి తీసుకువెళతామని, అప్పటికీ న్యాయం జరగకపోతే తదుపరి కార్యాచరణపై ఆలోచిస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో న్యాయవాదులు శైలాడ శ్రీరాములు, మాజీ అధ్యక్షులు సిద్ధేశ్వర మిశ్రా, నీలమాధవ అధికారి, గౌరీ కుమార్ సాహు, మలయమాధురి త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడిలోకి...



అనుపోత్సవంలో మాశ్యామకాళీ దేవి

పర్లాకిమిడి:

దీపావళి నుంచి పదకొండు రోజుల పాటు పూజలు అందుకున్న మాశ్యామకాళీ సోమవారం గంగమ్మ ఒడిలోకి చేరుకుంది. ఈ క్రమంలో బుసాని యాత్రను నిర్వాహకులు ఆడంబరంగా నిర్వహించారు. అంకావీధి, బెబర్తా వీధి నుంచి పర్లాకిమిడి పురవీధుల్లో బాజాభజంత్రీలతో బుసాని యాత్రను జరిపారు.

చిత్రకొండ సమితిలో మావో డంప్ స్వాధీనం



మావోయిస్టుల డంప్‌లో సామగ్రి





విప్లవ సాహిత్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి జాంత్రీ పంచాయతీలోని 177 బెటాలియన్ బీఎస్ఎఫ్ జవాన్లు ఆదివారం సాయంత్రం అరళిపాడ్, తాబర్ గ్రామ అడవిలో కూంబింగ్‌కు వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున తిరిగి వస్తున్న సమయంలో మట్టిలో పాతిన డంప్‌ను వెలికి తీశారు. డంప్‌లో 56 జిలిటిన్ స్టిక్స్, 13 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, కోరిడెక్స్ కట్ట, 30 మిట్టర్లు, కరెంటు వైర్లు, మావోల సాహిత్యం, డైరీలు, బ్యాటరీలు ఉన్నాయి. డంప్‌ను స్వాధీనం చేసుకుని జొడాంబొ బీఎస్ఎఫ్ క్యాంపునకు తరలించారు. జాంత్రీ ప్రాంతంలో కూంబింగ్ ముమ్మరం చేశారు.

బడిగాం వద్ద అష్ట ప్రహరి



అష్టనామసంకీర్తనలో పాల్గొన్న హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: జిల్లాలో కాశీనగర్ బ్లాక్ బడిగాం రాధాగోవింద మందిరం వద్ద కార్తీక మాసం సందర్భంగా అష్టపహరీ నామసంకీర్తన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైటెక్ విద్యాసంస్థల చైర్మన్, బీజేడీ నాయకులు డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావులు హాజరయ్యారు. అష్టపహరీ నామసంకీర్తన కార్తీక పౌర్ణమి వరకూ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జయపురం: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, అతడి తల్లి, భార్య తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. మరొకరు కూడా గాయపడ్డారు. మృతి చెందిన వ్యక్తి జయపురం సమితి పనసపుట్‌బగర పంచాయతీ జోగిపుట్ వాసి మకర హరిజన్(45)కాగా గాయపడిన అతడి తల్లి కళావతి హరిజన్(55)మరో వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యక్తి వై.బాదుషా. జయపురం సదర్ పోలీసు ఏఎస్ఐ సులోచన ప్రధాన్ తెలిపిన వివరాల మేరకు.. రెండు రోజుల కిందట కళావతి, ఆమె కుమారుడు మకర హరిజన్, కోడలు లక్ష్మీలు బొయిపరిగుడ సమితి గుప్తేశ్వర్‌లో బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం సాయంత్రం వారు బైక్‌పై తమ గ్రామానికి వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో నలుగురు గాయపడ్డారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను జయపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్చారు. వారిని పరీక్షించిన వైద్యులు మకర హరిజన్ మృతి చెందాడని ప్రకటించారు. కళావతి తీవ్ర గాయాలు కాగా.. లక్ష్మికి సాధారణ గాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తికి తలపైన, చేతులు, కాళ్ల పైన బలమైన గాయాలయ్యాయి. సోమవారం పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశామని పోలీసు అధికారి తెలిపారు.



ప్రమాదంలో మరణించిన మకర హరిజన్



తీవ్రంగా గాయపడిన కళావతి హరిజన్

నవ్వుతోనే సంపూర్ణ ఆరోగ్యం



మస్తాన్ రెడ్డిని సన్మానిస్తున్న స్పందన సభ్యులు



నృత్యప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు



వార్షికోత్సవంలో పాల్గొన్న కళాభిమానులు

రాయగడ: ఆనందంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని విశాఖపట్నంకు చెందిన ప్రముఖ హాస్య కవి, క్రియేటివ్ కామెడీ క్లబ్ ప్రధాన కార్యదర్శి మేడా మస్తాన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. స్థానిక స్వాగత్ లైన్‌లో గల శ్రీరామలింగేశ్వర ఆలయం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ 29వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నవ్వడం, నవ్వించడం దేవుడిచ్చిన వరమని అన్నారు. విశాఖపట్నం నుంచి వచ్చిన ప్రముఖ రంగస్థలం నటులు వర్రే నాంచారయ్య మాట్లాడుతూ నేటి నాటకాలపై యువత ఆసక్తి కనబరచాలని అన్నారు. నాటక రంగం మరి కొంత కాలం ముందుకు వెళ్లాలంటే అందుకు యువత పాత్ర చాలా కీలకమని చెప్పారు. స్పందన సంస్థ అధ్యక్షుడు గుడ్ల గౌరి ప్రసాద్ మాట్లాడుతూ సంస్థ ఆవిర్భావం గురించి వివరించారు. వచ్చే ఏడాది వార్షిక సంచికను వెలుడలేలా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రముఖ కవి, రచయిత భళ్లమూడి నాగరాజ, బాల కృష్ణ పట్నాయక్‌లు అతిథులను పరిచయం చేశారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ పతివాడ తులసీ దాస్ వార్షిక నివేదికను వినిపించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. స్పందన నృత్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

క్లుప్తంగా

ఘనంగా అభిరాం పరమహంస ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: స్థానిక లేబర్ కాలనీ సమీపంలో అభిరాం పరమ హంసదేవ్ ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరమహంస మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మందిర నిర్మాణానికి ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పరమేశ్వర పాత్రో, భాస్కర గౌఢ, నారాయణ గౌఢ, విజయ గౌఢ, గంగాధర బెహర తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



ఎస్పీ జితేంత్రనాథ్ పండాను కలిసిన గజపతి చాంబర్స్ కామర్స్ అధ్యక్షులు పొట్నూరు రామకృష్ణ

పర్లాకిమిడి: పట్టణంలో రోజురోజుకు దొంగతనాలు జరుగుతున్నందున, ప్రధాన మార్గాలైన మార్కెట్, బస్టాండు, రాజవీధి ఇతర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ గజపతి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పోట్నూరు రామకృష్ణ ఎస్పీ జితేంద్రనాథ్ పండాను కోరారు. అందుకు ఎస్పీ జితేంద్రనాథ్ పండా సానుకూలంగా స్పందించారని, దీనికై హోంశాఖ కొంత నిధులను కూడా మంజూరు చేసినట్టు చెప్పారని పి.రామకృష్ణ తెలియజేశారు. గజపతి వ్యాపార వర్గాల ప్రతినిధులు మల్లా శ్రీను, సంతోష్, సుధాకర్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 49 వినతులు



సమస్య వింటున్న అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్) 49 వినతులు అందాయి. ఇందులో పాత ఫిర్యాదులు ఎనిమిది ఉండటం గమనార్హం. అదనపు ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు అర్జీదారుల నుంచి ఫిర్యాదులు అందుకుని సత్వరమే పరిష్కారం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

'మీకోసం' 53 వినతులు



రిజిస్ట్రేషన్ కౌంటర్లను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 53 వినతులు వచ్చాయి. సమస్యలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని టీపీ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు 10 నెలల బకాయి వేతనాలు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీ.హెచ్.అమ్మన్నాయుడు కోరారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు అన్యమతాల్లో చేరితే వారికి ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువపత్రాల మంజూరు నిలిపివేయాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల రక్షణ సంక్షేమ వేదిక అధ్యక్ష, కార్యదర్శులు చింతాడ సోమేశ్వరరావు, మురపాక సన్యాసిరావు కోరారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కారు బోల్తా



పల్టీలు కొట్టిన కారు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి జాతీయ రహదారిపై కారు పల్టీలు కొట్టింది. బరంపురం పట్టణానికి చెందిన శ్రీనివాస్ దంపతులు కారులో సోమవారం ఉదయం టెక్కలి వస్తుండగా లొద్దపుట్టి వెంకటేశ్వర ఆలయం సమీపంలో ఎదురుగా బైక్‌ను తప్పించబోయి పల్టీకొట్టి బోల్తాపడింది. స్థానికులు గమనించి వెంటనే దంపతులను బయటకు తీశారు. చిన్నపాటి గాయాలు తప్ప పెద్దగా ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

పరమేశ్వరుడి చెంత..

పార్కింగ్ దందా!

- శ్రీముఖలింగంలో అదనపు వసూళ్లు
- నిబంధనలకు పాతరేసిన పాటదారుడు
- పట్టించుకోని అధికారులు



శ్రీముఖలింగం ఆలయం వద్ద వాహనాలు

జలుమూరు : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీముఖలింగంలో పార్కింగ్ పేరిట దోపిడీ సాగుతోంది. నిర్దేశిత మొత్తానికి అదనంగా వసూలు చేస్తూ నిబంధనలకు పాతర వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇక్కడి పార్కింగ్ వసూళ్ల ఇష్టారాజ్యంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు బేఖాతరు..

ఆలయానికి వచ్చే వాహనచోదకుల నుంచి ఆశీల వసూలుకు ఏడాదికి ఒకసారి వేలం పాట నిర్వహిస్తారు. అధిక మొత్తానికి ఎవరు పాట దక్కించుకుంటారో వారికే పంచాయతీ ఆశీల వసూలు బాధ్యతలు అప్పగిస్తారు. ఈ ఏడాది జూన్‌లో రూ.3.26 లక్షలకు వేలం పాట ఖరారయ్యింది. ఇందులో ద్విచక్ర వాహనానికి రూ.10, ఆటో రూ.20, కారు రూ.30, మినీ వ్యాన్ రూ.70, టూరిస్ట్ బస్ రూ.100, లారీకి రూ.100 చొప్పున వసూలు చేయాలి. ఇక్కడ వేలం పాటదారుడు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తుండటంపై భక్తులు మండిపడుతున్నారు. కారుకు రూ.30 ఉండగా రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. శివరాత్రి, కార్తీక మాసం వంటి పర్వదినాలతో పని లేకుండా ఇక్కడ ఏడాది మొత్తం అక్రమ వసూళ్ల దందా సాగుతోంది. బోర్డులో సూచించిన విధంగా కాకుండా అదనంగా వసూలు చేస్తున్నారు. ఇందుకు పంచాయతీ రశీదులు సైతం ఇవ్వడం గమనార్హం. ఇటీవల ఓ మాజీ ఎమ్మెల్యే వాహనానికి ఆశీలు రూపంలో అదనంగా అడగడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంతో మిన్నకుండిపోయారు.

ఈ దీనిపై పంచాయతి కార్యదర్శి చిన్నాల శ్రీనివాస్‌రావు వివరణ కోరగా అక్రమ వసూళ్ల పై పిర్యాదులు వచ్చాయని ఇక నుంచి అలా జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని ఇప్పటికే వారికి హెచ్చరించడం జరిగిందన్నారు. ఇక నుంచి అలా జరగకుండా చూస్తామన్నారు.



కారుకు రూ.50 వసూలు చేసిన రశీదు

కొనసాగిన కక్షసాధింపు

పోలాకి: మండలంలోని చెల్లాయివలసలో అధికార పార్టీ కక్షసాధింపు వరుసగా రెండోరోజు కూడా కొనసాగింది. వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతు రామకృష్ణకు చెందిన పశువుల శాలను సోమవారం ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా అధికారులు తొలగించారు. మూగజీవుల తరలింపునకు ప్రత్యామ్నాయం కోసం ఒక్కరోజు గడువు అడిగినా తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్‌లు అవకాశం ఇవ్వలేదు. పోలాకి, నరసన్నపేట ఎస్‌ఐలు రంజిత్, దుర్గాప్రసాద్‌తో సహా పదుల సంఖ్యలో సిబ్బందిని మోహరించి భయభ్రాంతులకు గురిచేయడంపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ అధికారులకు పూర్తిగా సహకరిస్తామని..



అధికారులతో మాట్లాడుతున్న బాధితుడు రామకృష్ణ

గ్రామంలో అనేక ప్రభుత్వ స్థలాల్లో పక్కా నిర్మాణాలు జరిగాయని, వాటిని సైతం తొలగించాలని కోరారు. లేకుంటే ఇవే స్థలాల్లో మళ్లీ పశువులశాలలు నిర్మిస్తామని తేల్చిచెప్పారు. గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలన్నీ తొలగిస్తామని అధికారులు హామీఇచ్చారు.

చిట్స్ మేనేజర్‌పై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని సరస్వతీ థియేటర్ సమీపంలోని శ్రీరామ్ చిట్స్ బ్రాంచి మేనేజర్ ఆర్.మణికంఠపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 9న ప్రకాష్‌నగర్‌లో నివసిస్తున్న కరక సత్యనారాయణ, రమ దంపతుల ఇంటికి ముగ్గురు విశాఖ వాసులతో వెళ్లిన మేనేజర్ పెట్రోల్ పోసి బెదిరించిన సంగతి తెలిసిందే. బాధితురాలు రమ అదే రోజు సాయంత్రం ఫిర్యాదు చేయగా సీఐ ఈశ్వరరావు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

కాశీబుగ్గ: ఇంటిముందు ఉంచిన తన బైక్ చోరీకి గురైందని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 24వ వార్డు పురుషోత్తపురం గ్రామానికి చెందిన బొంతు జయరాం సోమవారం ఫిర్యాదు చేసినట్టు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి ఇంటి ముందు హ్యాండిల్ లాక్ వేసి ఉంచిన ద్విచక్ర వాహనం సోమవారం ఉదయం చూసేసరికి లేదని ఫిర్యాదు పేర్కొన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

పకడ్బందీగా ఎస్సీ, ఎస్టీ చట్టాల అమలు

ఎచ్చెర్ల క్యాంపస్: కుల వివక్షలేని సమాజం సాధ్యం కావాలంటే ఎస్సీ, ఎస్టీ చట్టాలు సమర్థంగా అమలు కావాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ చట్టాలు, షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల అత్యాచార నిరోధక చట్టం-1989 పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వివక్ష, అత్యాచారాలు పూర్తిగా అంతరించాలంటే చట్టాలు పకడ్బందీగా అమలు జరగాలన్నారు. తప్పు చేసిన వారిపై పూర్తిస్థాయిలో ఎఫ్ఐఆర్, చార్జిషీట్ పోలీసులు నమోదు చేయటం, సాక్ష్యాలు బలంగా ఉండేలా చర్యలు తీసుకోవడం ముఖ్యమన్నారు. అయితే, వ్యక్తిగత కక్షల కోసం ఈ చట్టాన్ని ఉపయోగిస్తే కోర్టుల్లో శిక్ష పడే అవకాశం ఉండదన్నారు. సీఐడీ అదనపు ఎస్పీ జి.ప్రేమకాజల్ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టాలు 35 ఏళ్ల క్రితం ప్రారంభమైనా ఇంకా కులవివక్ష కేసులు నమోదు కావటం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిలు చక్రవర్తి, వాణి, మాధురి, జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ దుర్గా ప్రసాద్‌రాజు, జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కంఠ వేణు, అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసి నాయుడు

గణిత అవధానికి సత్కారం

కంచిలి: సోంపేట మండలం బూరగాం గ్రామానికి చెందిన ప్రభుత్వ గణిత ఉపాధ్యాయుడు మడ్డు తిరుపతిరావుకు గణిత దశావధానంలో సత్కరించారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గుడిలోవ గ్రామంలో విజ్ఞాన విహార్ పాఠశాలలో నిర్వహించిన గణిత అవధానం ఎంతగానో విద్యార్థులను ఆలోచింపజేసింది. అనంతరం వెయ్యి మందికి పైగా చిన్నారుల సందేహాలను నివృత్తి చేయడంతో ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం తిరుపతిరావును ఘనంగా సత్కరించారు.

ప్రొఫైలింగ్ యాప్‌లో డ్వాక్రా మహిళల వివరాలు

కాశీబుగ్గ: డ్వాక్రా మహిళలంతా తమ వివరాలను ప్రొఫైలింగ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సీఎంఎం మోహన్ అన్నారు. జంట పట్టణాల్లో ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో సంఘాల నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించారు. సంఘాల నమోదులో పేర్లు తప్పులు లేకుండా సరిచూసుకోవాలని కోరారు. శ్రీగాయత్రి సమైఖ్య, సర్ణభారతీ స్వయం శక్తి సంఘంలో సభ్యులు వివరాలు నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. 16వ వార్డు నెహ్రూనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సీవో బాలరాజు, ఆర్‌పీ పుణ్యవతి పాల్గొన్నారు.

కోడిపందెం శిబిరంపై దాడి

నరసన్నపేట: మండలంలోని లుకలాం సమీపంలో వంశధార నది ఒడ్డున రెల్లి పొదల్లో జరుగుతున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఆదివారం రాత్రి వీటిని నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బృందం దాడులు నిర్వహించి నిర్వాహకుడు ఎం.శ్రీనుతో పాటు మరో 16 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కోడి కత్తి, 13 ద్విచక్ర వాహనాలు, 8 కోడి పుంజులు, 15 మొబైల్ ఫోన్లు, రూ.45420 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన స్కూల్‌గేమ్స్ స్టేట్‌మీట్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా సాగిన 68వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లాల) స్కూల్‌గేమ్స్ బాస్కెట్‌బాల్ (అండర్-19), మోడర్న పెంటాథ్లెన్(అండర్-17,19) చాంపియన్‌షిప్-2024 పోటీలు సోమ వారం సాయంత్రంతో ముగిశాయి. ఎన్టీఆర్‌ఎంహెచ్ స్కూల్ మైదానంలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో కృష్ణా జిల్లా బాలబాలికల జట్లు రెండు విభాగాల్లోను చాంపియన్‌గా నిలిచారు.బాలుర విభాగం విశాఖ, బాలికల విభాగంలో పశ్చిమగోదావరి రన్నరప్‌గా నిలిచాయి. మోడర్న్ పెంటాథ్లెన్ పోటీల్లో జాతీయ పోటీలకు ఎంపికైన 16 మందికి పతకాలు అందజేశారు. విజేత జట్లకు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారుడు పి.సుందరరావు చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, హెచ్‌ఎంలు మెండ చంద్రశేఖర్, సీహెచ్ దేవదత్తానంద్, బడి వెంకటరమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, బి.నిర్మల్‌కృష్ణ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.అర్జున్‌రావు రెడ్డి, డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, పి.తవిటయ్య, చల్లా జగదీష్, హరిబాబు, నారాయణరావు, పీడీలు, పీఈటీలు, టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు పాల్గొన్నారు.



మోడర్న్ పెంటాథ్లెన్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

జయపురం: ప్రాచీన సాంప్రదాయ కళలు, సంస్కృతులను పరిరక్షించేందుకు కృషి చేస్తున్న తరుణ ప్రజ్ఞాభారతి సంస్థ విద్యార్థులకు ప్రతిభా పోటీలను సోమవారం నిర్వహించింది. ప్రజ్ఞా భారతి అధ్యక్షుడు తపన కిరణ్ త్రిపాఠీ పర్యవేక్షణలో స్థానిక నారాయణీ ఇంగ్లిష్ మీడియం కళాశాల ప్రాంగణంలో చిత్ర లేఖనం, ప్రాచీన ప్రబంధ రచన, పురాణ కథల రచన పోటీలు నిర్వహించారు. వచ్చేవారం విలువిద్య పోటీలు, పరుగు పందేలు చేపట్టనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి సువర్ణకుమారీ ఖిలో వెల్లడించారు. కార్యక్రమంలో అక్షయ కుమార్ మాలిక్, రవీంద్ర మహరాణ, సబిత త్రిపాఠీ పాల్గొన్నారు.



ప్రబంధ రచన పోటీల్లో విద్యార్థులు

వేధింపులు ఆపకపోతే ఉద్యమబాటే

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులను ఆపకపోతే ఉద్యమబాట తప్పదని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావులతో కలిసి సోమవారం శ్రీకాకుళం డీఈఓ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.10 వేలు, ప్రతి నెలా 5వ తేది లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 50మందిని అన్యాయంగా తొలగించారని చెప్పారు. అనంతరం డీఈవో తిరుమల చైతన్యకు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, యూటీయఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, ఎన్.వి.రమణ, ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, నాయకులు పి.ఖగేష్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా నాయకులు టి.సీతమ్మ, కె.కౌసల్య, ఎస్.గీతాబాల, టి.ప్రవీణ, డి.జమ్మాలు, వై.లక్ష్మి, రాములమ్మ, భూదేవి పాత్రో తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

లిఫ్ట్ ప్రమాదంలో కార్మికురాలు మృతి



వరలక్ష్మి(ఫైల్)

రణస్థలం: మండలంలోని పైడి భీమవరం పారిశ్రామికవాడలో ఏపీటోరియా (అరబిందో) పెన్సిలిన్ ప్లాంట్‌లో క్యాంటీన్ కార్మికురాలు దోర రామలక్ష్మి (37) లిఫ్ట్ ప్రమాదంలో దుర్మరణం చెందింది. జె.ఆర్.పురం పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పెన్సిలిన్ ప్లాంట్ క్యాంటీన్ వద్ద లిఫ్ట్ కింద ప్రాంతంలో రామలక్ష్మి శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా పైనుంచి లిఫ్ట్ బాక్స్ కిందకు పడిపోయింది. అందులో రామలక్ష్మి ఇరుక్కుని తీవ్ర గాయాల పాలైంది. వెంటనే పరిశ్రమ అంబులెన్స్‌లో విజయనగరం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఆమె అత్తవారు విజయనగరంలోని కోడగంటివారి వీధిలో ఉండగా.. ఉద్యోగ రీత్యా పైడిభీమవరంలోని తల్లి ఇంటి వద్దే ఉంటోంది. పన్నెండేళ్లుగా ఇక్కడే పని చేస్తోంది. భర్త అప్పలరాజు విజయనగరంలో ఉంటున్నారు. ముగ్గురు పిల్లలు పుట్టి చనిపోయారు. మృతురాలి సోదరుడు గోర అప్పలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

50 లక్షల పరిహారం చెల్లించాలి..

రామలక్ష్మి కుటుంబ సభ్యులకు రూ.50లక్షలు పరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరిశ్రమలో సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. పరామర్శలో విజయనగరం జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఏ.జగన్మోహన్ తదితరులు ఉన్నారు.



లిఫ్ట్ ప్రమాదం జరిగిన ప్రదేశం

సొండిపూడిలో వ్యాసరచన పోటీలు

కాశీబుగ్గ: మందస మండలం సొండిపూడి జెడ్పీహెచ్ పాఠశాలలో జాతీయ సంపద సృష్టిలో దేశ సమగ్రత పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. విజేతలుగా మట్ట హర్ష, జె.నిహారిక, పి.పావని మొదటి మూడుస్థానాల్లో నిలవగా.. వై మధుప్రియ కన్సోలేషన్ బహుమతులను గెలుచుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందర్ సల్మాన్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రతినిధి కోన శేఖర్, మేనేజర్ కె.రఘుపతిరావు, జూనియర్ ఇంజినీర్ ఇ.అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం జాతీయ రహదారి-16పై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన తిప్పన పృథ్వి (22) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పృథ్వి ఒక వాహనంపై.. మరో ఇద్దరు స్నేహితులు వేసే వాహనంపై ఇచ్ఛాపురం వచ్చారు. అక్కడ వారి పనులు ముగించుకొని తిరిగి తిప్పనపుట్టుగ గ్రామానికి వెళ్తుండగా స్కైడ్రాప్ కూడలిలో పృథ్వి వాహనంతో రోడ్డు దాటుతుండగా బరంపురం నుంచి సోంపేట వైపు వెళ్లే గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. తీవ్రగాయాలైన పృథ్విని స్థానికుల సహాయంతో తోటి స్నేహితులు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు. యువకుని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి అమ్మ అన్నపూర్ణ, నాన్న నారాయణలు ఉన్నారు.

హరోంహర



జలుమూరు: పూజలు అందుకుంటున్న ముఖలింగేశ్వరుడు



ఉమారుద్ర కోటేశ్వరాలయంలో స్వామికి అభిషేకం

తొలిపొద్దు జాము నుంచి శివుడిపై పంచామృతాలు కురుస్తూనే ఉన్నాయి. వేకువ ఘడియల నుంచి హరుని ఆలయ ఆవరణలో గంటలు గణగణ మోగుతూనే ఉన్నాయి. పవిత్ర కార్తీక మాసం రెండు సోమవారం నాడు జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. నమక చమక సహిత మంత్రాలతో స్వామిని అర్చించి అభిషేకించారు.

టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామికి శీర్షాభిషేకాలు చేస్తున్న భక్తులు



క్లుప్తంగా

కాలిపోయి మహిళ మృతి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం గ్రామానికి చెందిన సారికి సింహచలం(60) కాలిపోయి మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి సోమవారం తెలిపారు. సింహాచలం తన తమ్ముడు ఇంట్లో ఉంటోంది. ఆమెకు చుట్ట అలవాటు ఉంది. నిద్రపోతున్న సమయంలో కాల్చిన చుట్ట ఆమె చీరకు అంటుకుంది. ఆ విషయం గమనించకపోవడంతో నిద్రలో ఆమె శరీరం కాలిపోయింది. ఉదయం నాలుగు గంటల సమయంలో చూసిన కుటుంబసభ్యులు వెంటనే 108లో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

ఐటీడీఏ గ్రీవెన్స్‌సెల్‌కు 46 వినతులు



గ్రీవెన్స్‌సెల్‌లో వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 46 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ఇప్పగూడ గ్రామానికి చెందిన సవర రమేష్ మేకల లోన్ మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. అలాగే వీరఘట్టానికి చెందిన మరడాన శాంతికుమారి భాషా వలంటీర్ ఉద్యోగం ఇప్పించాలని, ఇరపాడుకు చెందిన మోహన్‌రావు పవర్ టిల్లర్ కావాలని కోరారు. విద్యుత్ స్తంభాలు గ్రామంలో వేయించాలని పుబ్బాడ గ్రామస్తులు అర్జీ అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఇసుకతవ్వకాలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు దావల రమణరావు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాతృ, శిశు మరణాలు లేకుండా చర్యలు తీసుకోండి

- డీఎంహెచ్ఓ డాక్టర్ రాణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రాణి

విజయనగరం ఫోర్ట్: మాతృ, శిశు మరణాలు జిల్లాలో సంభవించకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.రాణి అన్నారు. ఈ మేరకు ఈఏడాది జూలై నుంచి అక్టోబర్ నెలవరకు జరిగిన ఏడు మాతృ, 12 శిశు మరణాలపై స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాతృ, శిశు మరణాలు పునరావృతం కాకుండా గర్భిణులను ఆస్పత్రికి తరలించి, ప్రసవమయ్యే వరకు పర్యవేక్షించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డీఐఓ అచ్యుతకుమారి, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ రజనీకుమారి, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కిశోర్‌కుమార్, డీపీహెచ్ఎన్ఓ మామిడి సత్యవతి, డెమో చిన్నతల్లి, హెచ్ఈఈఓ పి. రత్నకుమరి తదితరులు పాల్గొన్నారు.

రెండు పశువుల శాలలు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సంతకవిటి: మండలంలోని ముకుందపురం గ్రామానికి చెందిన గడే సంతోష్‌కుమార్ పశువుల శాల, 2 ఎకరాల గడ్డివాము దగ్ధమైనట్లు రాజాం ఫైర్ సిబ్బంది వెల్లడించారు. కార్తీక మాసం సందర్భంగా వెలిగించిన దీపం ఒత్తిని పక్షులు తీసుకువచ్చి గడ్డి వాముపై వేయడంవల్ల గడ్డి వాము, పక్కనే ఉన్న రెండు పశువుల శాలలు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం మేరకు గ్రామానికి వచ్చి మంటు అదుపు చేసిన సిబ్బంది సుమారు రూ.50వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనాగా వెల్లడించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన రెడ్డి జగన్నాథం(49) ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఏఎస్సై సన్యాసిరావు తెలిపిన వివరాల ప్రకారం చెడు వ్యసనాలకు బానిసైన జగన్నాథం భార్య వాణి భర్తను విడిచిపెట్టి పుట్టింటికి వెళ్లిపోయింది.రెండు నెలలైనా భార్య ఇంటికి రాకపోవడం, ఒంటరిగా ఉన్నానన్న మనస్తాపంతో జగన్నాథం ఆదివారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోసుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఏఎస్సై చెప్పారు.

ఊపిరితిత్తులు జాగ్రత్త..!

- పెరుగుతున్న నిమోనియా కేసులు
- చలికాలంలో వ్యాధి వ్యాప్తి అధికం
- నేడు ప్రపంచ నిమోనియా డే





సర్వజన ఆస్పత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: నిమోనియా(నిమ్ము) వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే మృత్యువాతపడే ప్రమాదముంది. నిమోనియాని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా బయట పడవచ్చు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ కారణంగా నిమోనియా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధిలో వైరస్, బాక్టీరియా, ఫంగల్ రకాలు ఉన్నాయి. క్షయవ్యాధి కూడా ఈ వ్యాధిలో ఒకరకమే. మంగళవారం ప్రపంచ నిమోనియా డే సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. రోజురోజుకు నియోనియో .వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. చల్లటి వాతావరణం ఉన్నప్పుడు ఈవ్యాధి ఎక్కువగా వ్యాప్తిచెందే ఆస్కారముంది. నెలలో 400 నుంచి 500 వరకు నిమోనియో కేసులు నమోదువుతున్నాయి.

వ్యాధి లక్షణాలు

చాతిలో నొప్పి, దగ్గు, ఆయాసం, నోటి నుంచి రక్తం పడడం వ్యాధి లక్షణాలు. నిమోనియా చిన్న వయసులోని పిల్లల నుంచి ఏ వయసు వారికైనా సోకవచ్చు. చలికాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. డయాలసిస్ రోగులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి, హెచ్ఐవీ రోగులు, చిన్న పిల్లలు, పొగ, మద్యం తాగేవారికి ఎక్కువగా వ్యాధి సోకే పరిస్థితులు ఉన్నాయి. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ప్రాణాంతకమైన 10 వ్యాధుల జాబితాలో నియోనియా వ్యాధి కూడా ఉంది.

నిర్ధారణ ఇలా..

చెస్ట్ ఎక్స్‌రే ద్వారా నిమోనియాను నిర్ధారిస్తారు. అప్పటికి కూడా వ్యాధి నిర్ధారణ పూర్తిస్థాయిలో కాకపోతే సిటీచెస్ట్‌స్కాన్ తీసి నిర్ధారణ చేస్తారు.

జాగ్రత్తలు

నిమోనియో, ఆస్తమా ఉన్న వారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చేతికి వస్త్రం అడ్డం పెట్టుకోవాలి. నిమోనియా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యున్ని సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. కాలుష్యం ఉండే ప్రాంతాల్లో తిరగకూడదు. త్వరగా నిద్రపోవాలి. మధుమేహవ్యాధిని నియంత్రణలో ఉంచుకోవాలి. కూరగాయలు, పండ్లు, పప్పు ధాన్యాలు, పాలు, గుడ్డు ప్రతిరోజూ తీసుకోవాలి. స్వీట్స్, మైదా, గోధుములు, అన్నం తక్కువగా తీసుకోవాలి.

అలసత్వం వద్దు



నిమోనియా లక్షణాలు కనిపించిన వెంటనే అలసత్వం వహించకుండా వైద్యుడిని సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. మద్యం, పొగ తాగడం మానివేయాలి.చిన్న పిల్లలు, పెద్ద వారు నియోనియాకు వ్యాక్సిన్ వేయించుకోవాలి. నిమోనియా రాకుండా న్యూమోకోలర్, ఇన్ఫ్లు యాంజా వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఎదో ఒక వేయించుకుంటే వ్యాధి బారిన పడకుండా ఉంటారు.

డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్,
పలమనాలజిస్టు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

బైక్‌లు, సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాంబాబు, తదితరులు

పాలకొండ: పాలకొండ ప్రాంతంలో పలు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ ఎం రాంబాబు విలేకరులకు వివరించారు. సీతంపేట మండలంలోని ఈతమానుగూడకు చెందిన సవర సింహాచలం కొంత కాలంగా ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్‌లు దొంగతనం చేస్తున్నాడు. ముందుగా సీసీ కెమెరాలు లేని చోటును ఎంచుకుని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. కొత్త వ్యక్తులను పరిచయం చేసుకుని వారితో మాటలు కలిపి వారిని మోసగించి సెల్‌ఫోన్‌లు తీసుకుపోవడంలో దిట్ట అని డీఎస్పీ తెలిపారు. నిందితుడు సింహాచలంపై జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదై ఉండడంతో నిఘా ఏర్పాటు చేసి మండలంలోని సింగన్నవలస సెంటర్ వద్ద అదుపులోనికి తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిందితుడి దగ్గర నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో ఆయనతో పాటు సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగ మూర్తి ఉన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం తగదు

- డీవైఎఫ్ఐ విజ్ఞప్తి

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వివిధ రకాల కారణాల చెప్పి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చేయడం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్.హరీష్ సోమవారం ఒక ప్రకటనలో అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగాల కోసం, మార్పు కోసం రాష్ట్రంలోని నిరుద్యోగులు గంపగుత్తగా కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించడంలో కీలకపాత్ర వహించారన్నారు.తదనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు డీఎస్సీపై మొదటి సంతకం చేశారు కానీ నాలుగు నెలలవుతున్నా నోటిఫికేషన్ రాలేదన్నారు. అదిగో,ఇదిగో డీఎస్సీ నోటిఫికేషన్ అని ఊరిస్తున్నారు కానీ ఇప్పటికీ నోటిఫికేషన్ రావడం లేదన్నారు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ కారణంగా మళ్లీ నోటిఫికేషన్ విడుదల కాదేమో అని నిరుద్యోగుల్లో భయాందోళన మొదలైందన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం సంవత్సరాల తరబడి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటూ ఉన్నారన్నారు. ప్రభుత్వం వారి సమస్యను గుర్తించి డీఎస్సీ నోటిఫికేషన్ పై క్లారిటీ ఇచ్చి నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చేయకుండా చూడాలని విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కోరారు.

బీసీ హాస్టల్‌లో పరిస్థితులపై జేసీ ఆరా



హాస్టల్‌లో వంటగది పరిసరాలను పరిశీలిస్తున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: నగరంలోని మహారాణిపేట బీసీ బాలుర వసతి గృహాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారికి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. వంటగదిని పరిశీలించి పరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారు చేస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. హాస్టల్ సంక్షేమ అధికారి జానకీరావు, వంటవారితో మాట్లాడి విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత పాటిస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని పరిశుభ్ర వాతావరణంలో వండించి ఇవ్వాలని జేసీ ఈ సందర్భంగా హాస్టల్ సంక్షేమాధికారిని ఆదేశించారు. మెనూ ప్రకారం ఆహారం అందించకపోతే తమకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఇటీవల ఈ హాస్టల్‌లో ఉంటున్న 7వ తరగతి విద్యార్థి కొనతాల శ్యామలరావు అస్వస్థతకు గురై మరణించిన నేపథ్యంలో హాస్టల్‌లో పరిస్థితులను తెలుసుకునే నిమిత్తం జాయింట్ కలెక్టర్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. జేసీ పర్యటనలో బీసీ సంక్షేమాధికారి పెంటోజీరావు కూడా ఉన్నారు.

వాలీబాల్ విజేతలు కడప, శ్రీకాకుళం



మూడో స్థానంలో నిలిచిన విజయనగరం బాలుర జట్టు

- విజేతలకు ట్రోఫీల ప్రదానం
- ముగిసిన స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలు



కడప బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు

భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మూడు రోజుల పాటు సాగిన బాల, బాలికల 68వ అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో కడప, శ్రీకాకుళం జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా నిర్వహించిన పోటీలు సోమవారంతో ముగిశాయి. జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు అధ్వర్యంలో నిర్వహించిన పోటీలను డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు పర్యవేక్షించారు.

హోరాహోరీగా..

మూడో రోజు అండర్-14 బాలబాలికల వాలీబాల్ ఫైనల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. బాలుర విభాగంలో శ్రీకాకుళం- విశాఖపట్నం, బాలికల విభాగంలో కడప-గుంటూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్స్‌లో బాలుర విభాగంలో శ్రీకాకుళం, బాలికల విభాగంలో కడప జట్లు గెలుపొంది రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచాయి. ఈ పోటీలకు ఆతిథ్యం ఇచ్చిన విజయనగరం జట్టు బాలుర విభాగంలో మూడో స్థానంలో నిలిచింది.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

పోటీల అనంతరం వివిధ జిల్లాల జట్ల తరపున పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన బాలబాలికలను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వారు ఆంధ్రప్రదేశ్ అండర్-14 వాలీబాల్ బాలబాలికల జట్లకు ప్రాతినిథ్యం వహిస్తారు.

బాలుర జట్టు

రాష్ట్ర బాలుర జట్టుకు కె.వినయ్‌కుమార్, బి.కృష్ణ, కె.యువరాజ్‌శేఖర్ (శ్రీకాకుళం), డి.భానునీలమ్, పి.రాముడు(విశాఖపట్నం), ఎం.సంతు, వి.రాఘవేంద్ర(విజయనగరం), పి.నవీన్‌కుమార్ (వెస్ట్‌గోదావరి), పి.రాజు(చిత్తూరు), ఎస్.గోవర్ధన్‌నాయక్ (అనంతపురం), జె.మల్లేష్ (ఈస్ట్‌గోదావరి), కె.శ్రీరామ్(గుంటూరు) ఎంపికయ్యారు.

బాలికల జట్టు

రాష్ట్ర బాలికల జట్టుకు టి.భువనేశ్వరి, బి.భార్గవి, ఎన్.నాగతనూజ(కడప), కె.నందు (గుంటూరు), కె.దేవి(ఈస్ట్ గోదావరి), ఎం.మహాలక్ష్మి, కె.మహాశ్రీలక్ష్మి (వెస్ట్‌గోదావరి), బి.కాస్మిత (విశాఖపట్నం), కె.వాసు(చిత్తూరు), జి.రేవతి (విజయనగరం), పి.మానస (శ్రీకాకుళం) ఎంపికయ్యారు. జాతీయస్థాయి జట్ల ఎంపికతో భోగాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలు ముగిసినట్లు రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ భగవాన్‌దాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కేవీఏఎన్ రాజు, ఎంఈఓ చంద్రమౌళి, వ్యాయామ ఉపాధ్యాయుడు సింగిడి నాగన్న తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

100 రోజుల ప్రగతిపై నివేదికలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై కచ్చితమైన నివేదికలను రెండు రోజుల్లోగా సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కార్యాచరణ ప్రణాళిక ప్రగతిపై కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ప్రగతిని పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యాన, గృహనిర్మాణం, బిందు తుంపర సేద్యం తదితర శాఖల ప్రగతిపై ఆరా తీశారు. బుధవారం నాటికి సమగ్ర నివేదికలను అందజేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సీఈఓ పి.బాలాజీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

13 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం 13 కిలోల గంజాయిని స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో ఫ్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తుండగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వికాస్ వర్మ, సతీష్‌కుమార్ పాల్‌లు నిషేధిత గంజాయి రవాణా చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 65వేల విలువైన 13 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని చెప్పారు. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, అరకు రైల్వేస్టేషన్‌ల పరిధిలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్సై తెలిపారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా తయారీకి ఉపయోగించే సామగ్రి

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామం సమీపంలో కొండవాగు వద్ద సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల పులిసిన బెల్లం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రామారావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. ఈ మేరకు ఎస్సై రామారావు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలో సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గ్రామానికి సమీపంలో గల కొండవాగు ప్రాంతంలో సారా తయారీకి బెల్లం ఊటను మూడు ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వ ఉంచడం గమనించి ధ్వంసం చేశారు. అలాగే సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ, అమ్మకాలు జరిపితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశామని ఎస్సై హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది రాంబాబు, రాము, నాయుడు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు మాయం



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఉప కార్య నిర్వహణాధికారి వెంకటరావు, తదితరులు

డెంకాడ: పరిసరాల పరిశుభ్రతతో రోగాలను నివారించవచ్చని జెడ్పీ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరావు అన్నారు. మండలంలోని గుణుపూరు గ్రామంలో జరుగుతున్న ఐహెచ్‌హెచ్‌ఎల్ సర్వేను ఆయన సోమవారం పరిశీలించారు. సర్వేలో మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించడంతో పాటు మరుగుదొడ్డి ఉన్న వారు వాటిని వినియోగించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామ స్థాయి అధికారులు, ఉద్యోగులకు సూచించారు. అలాగే తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉంటే ఎంత దూరం ఉన్నాయి, ఎన్ని ప్రాంతాల్లో ఉన్నాయో గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భవానీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పని ఎక్కువ.. ఫలితం తక్కువ..!

- 20 ఏళ్లు గడుస్తున్నా రూ.5000 వేతనమే
- ఆదివాసీ విద్యావలంటీర్లపై ప్రభుత్వం చిన్నచూపు
- క్రమబద్ధీకరణకు నోచుకోని విద్యా వలంటీర్లు
- ఎన్నికల ముందు క్రమబద్ధీకరిస్తామని చంద్రబాబు హామీ
- ప్రస్తుతం పట్టించుకోని ప్రభుత్వం



పార్వతీపురం ఐటీడీఏ వద్ద నిరసన తెలుపుతున్న ఆదివాసీ మాతృ భాషా వలంటీర్లు (ఫైల్)


పార్వతీపురంటౌన్:

కొండశివారు ప్రాంతాల్లో విద్యార్థులు పాఠశాలకు వెళ్లకుండా బడిబయట కనిపించడంతో అప్పటి ఐటీడీఏ పీఓ..అక్షర క్రాంతి కళాజాతా బృందం పేరుతో సర్వే చేపట్టారు. ఆ సర్వేలో పిల్లలు తెలుగు భాషపై ఆసక్తి చూపకపోవడంతో 2002లో అప్పటి పీఓ సవరభాషా విద్యా వలంటీర్లను నియమించారు. అందుకోసం ఐటీడీఏ నిధులు కేటాయించి, అప్పట్లో రూ.వెయ్యి వరకు వేతనం ఇచ్చేవారు. ముందుగా ఐటీడీఏ పరిధిలో 20 పాఠశాలలతో ప్రారంభించి సవరభాషలో విద్యను బోధించడంతో విద్యార్థులు ఆసక్తి చూపారు. ప్రాథమిక పాఠశాలల్లో తమ భాషలో విద్యార్థులకు విజ్ఞానాన్ని నేర్పిస్తూ పునాది వేసుకుంటూ వారి విద్యాభివృద్ధికి విద్యావలంటీర్లు తోడ్పడుతున్నారు. దీంతో మిగతా పాఠశాలల్లోనూ సవర భాషా వలంటీర్లను నియమించారు. ప్రస్తుతం పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 176 సీతంపేట ఐటీడీఏ పరిధిలో 152మంది పాఠశాలల్లో విద్యా వలంటీర్లు పనిచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ సవర భాషా విద్యా వలంటీర్లు ఉంటూ విద్యార్థులకు వారి భాషలో విద్యాబోధన చేస్తారు. జిల్లాలో గల గిరిశిఖర గ్రామాల్లో గల పాఠశాలల్లో ఆదివాసీ ఒరియాలో బోధన చేస్తుంటారు. దీనివల్ల ఆదివాసీ ప్రాంతాల్లో చిన్నారులు చదువుపై ఆసక్తి చూపుతున్నారు.

ఐదు నెలలు గడుస్తున్నా నోరు మెదపని కూటమి ప్రభుత్వం

ఇప్పటికి సుమారు 22 ఏళ్లుగా సవరభాషా వలంటీర్లు విద్యార్థులకు బోధిస్తున్నారు. ఉదయం తొమ్మిదిగంటల నుంచి సాయంత్రం వరకు అన్ని సబ్జెక్టులు బోధిస్తున్నారు. అలాంటి ఆదివాసీ మాతృ బహుభాషా విద్యా వలంటీర్లను రెగ్యులర్ చేయాలని, లేకుంటే సీఆర్‌టీల మాదిరిగా టైం స్కేల్ ప్రకటించాలని పలుమార్లు మంత్రులు, అధికారులకు, గ్రీవెన్స్‌సెల్ లో వినతులు అందిస్తున్నారు. జీతాలు చాలడం లేదని వంటావార్పు, ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలు చేశారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనికరించలేదు. గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడికి అరకు బహిరంగ సభలో వినతులిచ్చారు. యువగళం పాదయాత్రలో భాగంగా పాయకరావుపేటలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విన్నవించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, అధికారంలోకి వస్తే ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నోరు మెదపడం లేదు..

తక్షణమే రెగ్యులర్ చేయాలి



ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ఆదివాసీ విద్యా వలంటీర్లను తక్షణమే రెగ్యులర్ చేయాలి. రూ.5 వేల వేతనంతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. ఒడిశా రాష్ట్రం మాదిరిగా సవర భాషా వలంటీర్లను రెగ్యులర్ చేయాలి. లేదంటే సీఆర్‌టీల మాదిరిగా టైం స్కేల్ ప్రకటించాలి. రాష్ట్ర విద్యాశాఖలో విలీనం చేయాలి. 12 నెలలూ జీతాలు చెల్లించాలి. – దుంబు, ఆదివాసి మాతృ భాష వలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి

విద్యా వలంటీర్లకు భరోసా కల్పించాలి

ఆదివాసీ విద్యా వలంటీర్లకు ప్రభుత్వం భరోసా కల్పించాలి. రూ. 5వేల వేతనంతో ఆర్థికంగా ఇబ్బందుతున్నారు. వారి రవాణా ఖర్చులకు సరిపోవడంలేదు. ఇతర రాష్ట్రంలో మాదిరిగా రెగ్యులర్ చేయాలి. ప్రతి నెలా వేతనం వచ్చేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం వారికి పూర్తి ఆర్థిక భరోసా కల్పించాలి.

– ఎస్, మురళి, యూటీఎఫ్, నాయకుడు

చాలీచాలని జీతంతో ఇబ్బందులు



చాలీచాలని జీతంతో ఇబ్బందలు పడుతున్నాం. మాకు ఎన్నికల ముందు రెగ్యులర్ చేస్తామని హామీఇచ్చారు. ఐదు నెలలు గడుస్తున్నా ఎటువంటి స్పందన లేదు. విద్యార్థుల కోసం ఎంతో కష్టపడుతున్నాం. నెల నెలా జీతాలు చెల్లించాలి. రూ.5 వేలు వేతనం రవాణా చార్జీలకే చాలడం లేదు. జీతాలు పెంచాలి. క్రమబద్ధీకరణ చేయాలి. వీటిపై అధికారులకు, పాలకులకు వినతులు అందించాం.

– బి.వెంకటేష్, ఆదివాసీ మాతృ భాషా వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు